సాక్షి నల్లగొండ

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



పేదల పక్షాన పోరాడిన ధర్మభిక్షం

జీవితాంతం పేదల పక్షాన పోరాడిన వ్యక్తి ధర్మభిక్షం అని గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.ప్రభాకర్ అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,47,182 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 2,02,404 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,826 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6,979 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,173 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం : 643.60 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 1,429 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 2,873 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 96 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 121 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు నల్లగొండకు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 8.50 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే పోలీసు అమర వీరుల దినోత్సవంలో పాల్గొంటారు. 11 గంటలకు ఖాజీరామారంలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, 11.45 గంటలకు మాడ్గులపల్లి మండలం ఎల్లమ్మగూడెం, తిప్పర్తి గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అదే మండలం ఎల్లమ్మగూడెం నుంచి ఆరెగూడెం రోడ్డు పనులను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత నల్లగొండలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు.

పోరాటాలకు సిద్ధం కావాలి



పట్టణ మహాసభలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : కార్పొరేట్లకు భజన చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం పట్టణ మహాసభల్లో ఆయన మాట్లాడారు. లైంగిక దాడి కేసులో జైలులో ఉన్న డేరా బాబాను హర్యానా ఎన్నికల సమయంలో పెరోల్‌పై విడుదల చేసి ప్రచారంలో వాడుకున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం పట్టణ నూతన కమిటీ కార్యదర్శిగా దండంపల్లి సత్తయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్ హాశం, ఊట్కూరి నారాయణరెడ్డి, ఎండీ.సలీం, కుంభం కృష్ణారెడ్డి, తుమ్మల పద్మ, గాదె నరసింహ, దండంపల్లి సరోజ, అద్దంకి నరసింహ, కాక లింగయ్య, మైల యాదయ్య, మధుసూదన్‌రెడ్డి, భూతం అరుణ, లింగమ్మ, నరేష్, అశోక్, నాగరాజు, లక్ష్మమ్మ, సైదులు పాల్గొన్నారు.

వచ్చేనెలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నల్లగొండ : జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలతో పాటు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు సంబంధించిన ఎగ్జిబిట్ల ప్రదర్శన నవంబర్ 3వ వారంలో నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణిత నమూనా, గణిత ఆలోచన, వ్యవస్థల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే అంశాలపై ప్రాజెక్టులు తయారు చేయాలని సూచించారు.

114 ఇన్‌స్పైర్ అవార్డులు

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 114 ఇన్‌స్పైర్ అవార్డులు మంజూరైనట్లు డీఈఓ తెలిపారు. 114 మంది విద్యార్థుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చేశారని పేర్కొన్నారు. ఈ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు.. సంబంధిత ప్రాజెక్టుతో వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 9848578845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

పంచ నారసింహుడికి ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రైతుకు ‘భరోసా’ లేదు!



మిర్యాలగూడలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- వానాకాలం పెట్టుబడి సాయం బంద్
- రైతుల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభుత్వం
- యాసంగి రైతు భరోసాపై కూడా స్పష్టత కరువు
- జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్, రైతుసంఘాల ఆందోళనలు
- వెంటనే ‘రైతు భరోసా’ ఇవ్వాలని డిమాండ్

నల్లగొండ అగ్రికల్చర్ : రైతు భరోసాపై రైతుల ఆశలు అడియాశలయ్యాయి. రైతులకు ప్రతీ సీజన్‌కు అందించే రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఎకరానికి సీజన్‌కు రూ.7500 చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన విషయం విధితమే. వానాకాలం సీజన్ ఆరంభం నుంచి రైతుభరోసా నిధులు ఖాతాల్లో జమ అవుతాయని రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కానీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులు ఇవ్వలేమని ప్రకటించడంతో రైతులు ఖంగుతిన్నారు. మరోవైపు యాసంగి సీజన్ రైతు భరోసాపై కూడా స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతు సంఘాలు ఆదివారం ఆందోళన చేపట్టాయి. పలుచోట్ల రైతులు, నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు అన్నదాతను మోసం చేశారని నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు భరోసాపై నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు. సబ్ కమిటీ పేరుతో రైతు భరోసాపై మరింత జాప్యం చేయకుండా.. వెంటనే వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

5,49,476 మంది రైతులు అర్హులు..

రైతుబంధు పేరుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాలో 5,49,476 మంది రైతులకు ఎకరాకు రూ.5వేల చొప్పున.. ప్రతి సీజన్‌కు రూ.625 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7,500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేస్తే జిల్లాలోని రైతులకు సుమారు రూ.900 కోట్లను జమ చేయాల్సి ఉంటుంది.

ఎకరాకు రూ.7,500 చొప్పున..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఎకరానికి రూ.5 వేల చొప్పున వానాకాలం, యాసంగి సీజన్లకు రూ.10వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేంది. సీజన్ ఆరంభంలోనే రైతు బంధు నిధులు అందేవి. ఆ డబ్బు రైతుల సాగు పెట్టుబడికి ఉపయోగపడేది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ. 7500 చొప్పున సంవత్సరానికి రూ.15 వేలను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వానాకాలం రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. వానాకాలం సీజన్ ముగిసింది కానీ, రైతు భరోసా నిధులు జమ కాలేదు.

యాసంగి సీజన్ ఆరంభం..

ప్రస్తుతం యాసంగి సీజన్ కూడా ఆరంభమైంది. ప్రభుత్వం మాత్రం పెట్టుబడి సాయంపై ఎలాంటి స్పష్టమైన ప్రకటనా చేయలేదు. ఈ తరుణంలో వానాకాలం రైతుభరోసా నిధులు ఇవ్వమని వ్యవసాయ శాఖ మంత్రి పేర్కొన్నారు. యాసంగి సీజన్ కూడా నిధులపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో అన్నదాతలు భగ్గుమంటున్నారు.

రైతు భరోసా విడుదల చేయాలి



ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయాలి. వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులను మోసం చేసే విధానాలను పాలకులు మానుకోవాలి.

నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

అప్పు చేసి సాగు చేశాం



ఎన్నికల ముందు రైతు భరోసాను రూ.7500 చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ భరోసాతో అప్పు చేసి వానాకాలం సాగు చేశా. ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన మాట తప్పి వానాకాలం రైతుభరోసా ఇవ్వమని చెప్పడం సరికాదు. రైతులకిచ్చిన మాట ప్రకారం రైతు భరోసా విడుదల చేసి ఆదుకోవాలి.

– కొప్పోలు రాము, రైతు, రామడుగు, హాలియా

రైతులను మోసం చేయొద్దు



ప్రభుత్వం రైతులను మోసం చేయకుండా ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం వానకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి రైతు భరోసా నిధులను ఖాతాలో వేసి ఆదుకోవాలి. భరోసా నిధులు ఇవ్వకపోతే రైతులు మరింత అప్పుల పాలవుతారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉన్నాం.

– వెంకటాద్రి రమేష్, వెంకటాద్రిపాలెం, హాలియా

చేనేత వస్త్రాలను ఆదరించాలి



వస్త్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, ఇతర అధికారులు

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ టూటౌన్ : చేనేత కార్మికులు తయారు చేస్తున్న వస్త్రాలను ప్రజలు ఆదరించాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వస్త్ర ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. ఈ సందరంగా మాట్లాడుతూ చేనేత కార్మికులు నాణ్యతతో కూడిన అన్ని రకాల డిజైన్లతో వస్త్రాలను తయారు చేస్తారని తెలిపారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ పి.వెంకటేశం, ఏడీ ద్వారక్, ఏడీఓ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాలతోనే సమాజం జాగృతం

- ఓయూ ప్రొఫెసర్ ఖాసీం

కోదాడ: విద్యార్థి ఉద్యమాలే పౌరసమాజాన్ని జాగృతం చేస్తాయని, విద్యార్థి ఉద్యమాలు తగ్గుముఖం పట్టడంతో అక్రమాలు పెరిగిపోతున్నాయని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ప్రొఫెసర్ ఖాసీం అభిప్రాయపడ్డారు. ప్రగతిశీల విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) అర్ధశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోదాడలోని కేఆర్‌ఆర్ కళాశాల పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాళ్లు కదలలేని స్థితిలో కూడా అన్నివర్గాల హక్కుల సాధనకు దివంగత ఆచార్యుడు సాయిబాబా చేసిన పోరాటం నేటి పౌరసమాజం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యనందించడంలో పాలక ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. బత్రోతులను తయారు చేసే విద్యావిధానంలో సమూల మార్పులు వచ్చేంత వరకు పోరాటాలు సాగించాల్సిన అవసరం విద్యార్థి సంఘాలపై ఉందన్నారు. ఎంత గొప్ప సిద్ధాంతమైన ఆచరణకు నిలబడ్డప్పుడే ఫలితాన్ని ఇస్తుందన్నారు. విద్యార్థి ఉద్యమాలకు అరుణతారగా నిలిచిన జార్జిరెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్యానికి పురుడు పోసిన కేఆర్‌ఆర్ కళాశాల విద్యార్థి సంఘాల పోరాటం మరువలేనిదన్నారు. కేఆర్‌ఆర్ కళాశాల పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి సంఘ నాయకుడు రాయపూడి చిన్ని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వల్లూరి రామిరెడ్డి, ధర్మార్జున్, కె. బాబురావు, పందిరి నాగిరెడ్డి, గంధం బంగారు, వక్కంతుల నాగార్జున, ముత్తవరపు పాండురంగారావు, పార సీతయ్య, పెదనాటి వెంకటేశ్వరరావు, డీఎస్ స్వామి, యుగంధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

అధ్యయనానికి ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- జిల్లాలో 21 నుంచి 28 వరకు సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం పర్యటన

నల్లగొండ : సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ బృందం అధ్యయనానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అధ్యయనం నిమిత్తం సివిల్ సర్వీసెస్ ప్రొబేషనరీ అధికారుల బృందం ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుందని తెలిపారు. పీఏ పల్లి మండలం రంగారెడ్డిగూడెం, చింతపల్లి మండలం జర్పులతండా, దేవరకొండ మండలం కర్నాటిపల్లి, కొండమల్లేపల్లి మండలం ఇస్లావత్‌తండా, పెండ్లిపాకల గ్రామాల్లో బృందం పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో గ్రామానికి ఐదుగురి చొప్పున కేటాయించామని తెలిపారు. ఈ బృందం వారికి కేటాయించిన గ్రామాల్లోనే 21 నుంచి 24వ తేదీ వరకు బస చేస్తుందని.. 25న అదే గ్రామపంచాయతీలో, 26, 27 తేదీల్లో దేవరకొండ, నాగార్జునసాగర్ మున్సిపాలిటీల్లో అధ్యయనం చేస్తుందని తెలిపారు. 28న జిల్లా కేంద్రానికి వచ్చి తనతో సమావేశం అవుతారని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీని ఆదివారం నల్లగొండ పట్టణంలోని లెక్చరర్ భవన్‌లో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొరివి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నారబోయిన లింగస్వామి, కోశాధికారిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, ప్రవీణ్, జాయింట్ సెక్రటరీగా అనిల్, అసోసియేట్ అధ్యక్షుడిగా దామెర శ్రీనివాస్, మహిళా కార్యదర్శిగా లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొరివి కృష్ణ, నారబోయిన లింగస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని 2.50 లక్షల సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అయిన పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పత్తి రైతుల పరేషాన్

- వారం క్రితమే సీసీఐ కేంద్రాలను ప్రకటించిన కలెక్టర్
- నేటికీ ప్రారంభంకాని కొనుగోళ్లు
- తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్న రైతులు



మునుగోడులోని జిన్నింగ్ మిల్లు

మునుగోడు : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంగా తయారైంది పత్తి రైతుల పరిస్థితి. రైతులు పండించిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ఏటా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లకు జిన్నింగ్ మిల్లులను వారం క్రితమే ఎంపికచేశారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించి పత్తికి మద్దతు ధర అందేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కానీ ఇప్పటి వరకు ఆయా మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో పంట చేతికి వచ్చిన రైతులు వ్యాపారులు అడిగిన రేటుకు విక్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు.

చండూరు మార్కెట్ పరిధిలో నాలుగు మిల్లులు ఎంపిక..

జిల్లాలో అధికంగా పత్తి పంట సాగుచేసే ప్రాంతమైన మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మార్కెట్ పరిధిలోని మునుగోడు, గట్టుప్పల్, సంస్థాన్‌నారయణపురం మండలాల్లోని నాలుగు పత్తి మిల్లులను అధికారులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు ఎంపిక చేశారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 80వేల రైతులు ఈ ఏడాది 1.76 లక్షల పత్తి సాగు చేశారు. ఎకరాకు సగటున 7 క్వింటాళ్లు పండినా.. 12.32 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఇప్పటికే దాదాపు 5 లక్షల క్వింటాళ్ల పంట చేతికి రావడంతో.. రైతులు కూలీల చేత ఏరించి అమ్మేందుకు మిల్లులకు తరలిస్తున్నారు. ఆయా మిల్లుల్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో మిల్లు యజమానులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించినా మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉండగా తేమశాతం అధికంగా ఉందని క్వింటాకు రూ.1200 నుంచి రూ.1300 వరకు తగ్గిస్తున్నారు.

పత్తిలో అధిక తేమ..

నిబంధనల ప్రకారం పత్తి తేమశాతం 8 నుంచి 12 ఉంటేనే సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేస్తారు. ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు చేనుపై పత్తి తడిచి అధిక తేమశాతం ఉండటంతో సీసీఐ అధికారులు కొనుగోళ్లు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారుల తీరువల్ల తేమశాతం తక్కువ ఉన్న పత్తికి కూడా మద్దతు ధర అందడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

క్వింటా రూ.6 వేలకే కొన్నారు



నేను 12 ఎకరాలు కౌలుకి తీసుకొని పత్తి సాగు చేశాను. నాకు మొదటి విడత 6 క్వింటాళ్ల దిగుబడి వస్తే దాన్ని క్వింటా రూ.6200 అమ్ముకున్నాను. రెండో విడత 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే దానిని అమ్ముకునేందుకు ఇటీవల మిల్లుకు వెళ్తే క్వింటా రూ.6 వేలకు కొనుగోలు చేశారు. దీంతో నాకు మద్దతు ధర కంటే క్వింటాకు రూ.1500లకు పైగా తక్కువ వచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే నాకు అదనంగా రూ.15 వేలు వచ్చేవి.

– సైదులు, కౌలు రైతు చీకటిమామిడి

వారం రోజుల్లో ప్రారంభిస్తాం

చండూరు మార్కెట్ పరిధిలో మొత్తం నాలుగు జిన్నింగ్ మిల్లులను సీసీఐ కొనుగోలు కేంద్రాలకు ఎంపిక చేశాం. కానీ పత్తిలో తేమశాతం అధికంగా ఉండటంతో కొనుగోళ్లు ప్రారంభించలేదు. పత్తి తేమ 8 నుంచి 12 శాతం ఉంటేనే రైతులకు మద్దతు ధర చెల్లించగల్గుతాం. వారం రోజుల తరువాత పత్తిలో తేమశాతం తగ్గుతుంది. అప్పటి నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

బాలచందర్ నిమ్జా, సీసీఐ కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి, చండూరు

పోలీస్ అమరులకు వందనం

- జిల్లాలో ప్రాణ త్యాగం చేసిన 15 మంది పోలీసులు
- నేడు పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం
- నేటి నుంచి 31 వరకు పలు కార్యక్రమాలు



పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెంటు

నల్లగొండ క్రైం : ప్రజల ధన, మాన ప్రాణాలను, శాంతిభద్రతలను కాపాడుతూ దేశ అభివృద్ధికి, ప్రజల రక్షణకు పోలీసు తన విధి నిర్వహణలో ప్రాణాలు అర్పిస్తున్నారు. ప్రాణ త్యాగం చేసి అమరులైన పోలీసులను స్మరించుకునేందుకు ఏటా అక్టోబరు 21న పోలీసు అమరుల సంస్మరణ (ఫ్లాగ్ డే)ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. విధి నిర్వహణలో 1991 నుంచి 2021 వరకు సంఘ విద్రోహుల చేతుల్లో జిల్లాలో అమరులైన 15 మంది పోలీసులు అమరులయ్యారు. అమరుల త్యాగాన్ని స్మరిస్తూ నేటి నుంచి ఈ నెల 31 పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమరులైన పోలీసులు, హోంగార్డు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తారు. కలెక్టర్, ఎస్పీ, మంత్రులు ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు.

జిల్లాలో అసువులు బాసింది వీరే..

మావోయిస్టులతో జరిగిన పోరాటంలో జిల్లాకు చెందిన 15 మంది పోలీసులు అమరులయ్యారు. వారిలో ఎంఏ.ఖలీం, ఎస్.శేఖర్‌రెడ్డి, కె.లక్ష్మయ్య, జి.వెంకటేశ్వర్లు, సోమనర్సయ్య, నమోద్‌రెడ్డి, కృష్ణారావు, శంకర్‌జీ, జి.గంగారాం, శంకర్‌నాయక్, చెన్నకేశవులు, జిలాని, సత్తయ్య, సుల్తాన్ మొయినోద్దీన్, కరీం 1991 నుంచి 2021 వరకు జరిగిన మావోయిస్టుల ఆపరేషన్‌లో అమరులయ్యారు.

31 వరకు కార్యక్రమాలు

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ సంస్మరణ వారోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌజ్, రక్తదాన శిబిరం, సైకిల్ ర్యాలీ, ఫొటో, వీడియో గ్రఫి, షార్ట్ ఫిల్మ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తారు. 23న జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలో ఉన్న పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌజ్ నిర్వహించి విద్యార్థులకు విధుల్లో ఉపయోగించే ఆయుధాలు, విధులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకునే నిర్ణయాలపై అవగాహన కల్పిస్తారు. 24న జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తారు. 26న పోలీసు అమరవీరులను స్మరిస్తూ భారీ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు. విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం అంశంపై ఇంటర్ విద్యార్థులకు, తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశంపై డిగ్రీ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. షార్ట్ ఫిలిం, ఫొటో గ్రఫీ, వీడియో గ్రఫి పోటీకి.. పోలీస్ ప్రతిష్ఠను పెంచేలా రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్‌నేరాలు, కమ్యూనిటీ పోలీస్, సామాజిక రుగ్మతలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల స్పందన, విపత్తుల సమయంలో పోలీసుల సేవలపై మూడు నిమిషాలు తగ్గకుండా తయారు చేసిన వీడియోలు, ఫొటోలు ఐటీ కోర్ విభాగం ఫోన్ నంబర్ 8712670426 కు పంపాల్సి ఉంటుంది. విజేతలకు జిల్లాస్థాయిలో బహుమతులు ప్రధానం చేసి.. రాష్ట్ర స్థాయికి పంపుతారు.

ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఉండాలి



ప్రతి ఒక్కరిలో దేశ భక్తి ఉండాలి. చైనాతో జరిగిన నాటి పోరాటంలో ఆయుధ సంపత్తి, బలగాలు కలిగి ఉన్న చైనా ఆగడాలను భారత్ జవాన్లు తిప్పి కొట్టారు. దేశం లోపల, దేశ సరిహద్దుల్లో సంఘ విద్రోహులను నియంత్రించేందుకు పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పిస్తున్నారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతూ విధి నిర్వహణ చేస్తున్నారు. వారిని స్మరించేందుకు పోలీసు అమరుల స్మారక వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమాల్లో యువత వారోత్సవాల్లో పాల్గొనాలి.

– ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నిరుపేదలకు సురక్ష బీమా

- బీమా పాలసీని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- బ్యాంక్ ఖాతా ఉంటే చాలు
- ప్రీమియం కోసం సంవత్సరానికి రూ.20 మాత్రమే ఖాతా నుంచి డెబిట్



భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అందుబాటులోకి తీసుకోస్తోంది. వీటిలో ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) కూడా ఒకటి. ఇది యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పథకం. అంటే పాలసీదారుడు ప్రమాదవశాత్తు మరణిస్తే.. వారి కుటుంబానికి ఆర్థిక భద్రత లభిస్తుంది. 18–70 ఏళ్ల మధ్య వయస్సు వారు ఈ పథకంలో చేరేందుకు అర్హులు.

మే నెల చివరిలో ఖాతా నుంచి డెబిట్

పీఎం సురక్ష బీమా యోజనలో చేరాలనుకునేవారికి బ్యాంకు ఖాతా తప్పనిసరిగా ఉండాలి. ఖాతాదారులు నేరుగా బ్యాంక్ అధికారులను కలిసి ఈ పథకం వివరాలు తెలుసుకోవచ్చు. ఈ బీమా పథకంలో తీసుకోవాలనుకునేవారు ఆటో డెబిట్ ఫెసిలిటీ యాక్టివేట్ చేసుకోవాలి. అంటే ఖాతాదారుడి బ్యాంకు అకౌంట్ నుంచి ప్రతి సంవత్సరం రూ.20 నేరుగా కట్ అవుతాయి. మే నెల చివరిలో డబ్బులు అకౌంట్ నుంచి డెబిట్ అవుతాయి. అందువల్ల ఖాతాదురుడు ఆ నెలలో అకౌంట్‌లో రూ. 20 కచ్చితంగా కలిగి ఉండాలి. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రమాదవశాత్తు మరణం, వైకల్యానికి సంబంధించి బీమా అందించే పథకం. గుండెపోటు సహజ కారణాల వల్ల మరణాలకు ఈ పథకం వర్తించదు. ఈ పథకం రిస్క్ కవరేజీ వయస్సు వారీగా ప్రమాదవశాత్తు మరణం మరియు పూర్తి వైకల్యానికి రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష రూపాయలను నామినీకి అందిస్తారు. అదేవిధంగా పీఎంజేజేబీవై (ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన)ను కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ పథకం రూ.436 వార్షిక ప్రీమియంతో అన్ని రకాల మరణాలను కవర్ చేస్తుంది. 18–50 ఏళ్ల మధ్య వారు ఈ బీమా పొందవచ్చు. ఈ బీమా పథకాలను అన్ని బ్యాంకులు, తపాలా కార్యాలయాల నుంచి తీసుకోవచ్చు.

కావాల్సిన డాక్యుమెంట్లు

- గుర్తింపు కోసం ఆధార్ కార్డు
- సెల్ నంబర్
- నామినీ వివరాలు
- బ్యాంక్ అకౌంట్

ఎవరెవరు పథకంలో చేరొచ్చు?

కేంద్రం అందిస్తున్న ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజనలో చేరాలని భావించే వారు 18 నుంచి 70 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. బ్యాంక్ అకౌంట్ ఉన్న వారు సులభంగా ఈ స్కీమ్‌లో చేరొచ్చు. నేరుగా బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లి అక్కడి సిబ్బందితో మాట్లాడితే సరిపోతుంది. ప్రీమియం కట్ చేసుకుని పాలసీ అందిస్తారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

బీమా పథకాలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి. వచ్చే ఏడాది జనవరి 15 వరకు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై ప్రతి గ్రామ పంచాయతీల్లో అధికారులు అవగాహన కల్పించాలి. నిరుపేదలకు ఈ పథకం చాలా ఉపయోగకరం.

– హనుమంతు కే. జెండగే, కలెక్టర్, యాదాద్రిభువనగిరి

క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. అనంతరం యజ్ఞశాలలో మహా సౌర హోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామ కోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు వికాస్‌పాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే, భక్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

త్రిపురారం : మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్థానికుల సమాచారం మేరకు నాగార్జున సాగర్ ఎడమ కాలువలో త్రిపురారం పోలీసులు శనివారం రాత్రి గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. ఆదివారం త్రిపురారం ఎస్‌ఐ వై ప్రసాద్ తెలిన వివరాల ప్రకారం.. కంపాసాగర్ వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాలువలో సుమారు 40 ఏళ్ల వయసు ఉన్న మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. మహిళ బ్లూ కలర్ జాకెట్, నలుపు రంగు లంగా ధరించి కాళ్లకు కడియాలతో ఉంది. కంపాసాగర్ బిల్ కలెక్టర్ అల్లాడి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మహిళ మృదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించామని, వివరాలకు హాలియా సీఐ నంబర్ 8712670152, త్రిపురారం ఎస్‌ఐ నంబర్ 8712670196, నిడమనూరు ఎస్‌ఐ నంబర్ 8712670195లను సంప్రదించాలన్నారు.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి

నేరేడుచర్ల : కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం పత్తేపురం గ్రామ శివారులో కోడిపందాలు ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడులను నిర్వహించారు. ఐదుగురు వ్యక్తులు..మూడు కోడి పుంజులతో బెట్టింగ్ ఆడుగుతుండగా పోలీసులు నలుగురు వ్యక్తులను పట్టుకోవడంతోపాటు మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నేరేడుచర్లకు చెందిర రెడ్డిపల్లి రాంప్రసాద్, సల్వాది రాజేష్‌కుమార్, ఓరుగంటి నరేష్, మంతన విజయ వెంకట నర్సింహరాజులు పట్టుబడగా దేవులపల్లి నర్సింహాచారి పరారయినట్లు తెలిసింది. మూడు కోడి పుంజులు, రూ.13 వేలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రిజైన్ చేస్తేనే రిలీవింగ్ ఆర్డర్

- బెటాలియన్‌లలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తూ 28 మంది డీఎస్సీలో ఎంపిక
- ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేస్తేనే రిలీవ్ చేస్తున్న పోలీస్ అధికారులు
- ఇన్ సర్వీస్ నష్టపోతున్నామంటున్న ఉద్యోగులు

నల్లగొండ: ఏదేని ఒక ప్రభుత్వ శాఖలో ఉద్యోగం చేస్తూ ఇతర శాఖలో ఉద్యోగం పొందితే ప్రస్తుతం ఏ శాఖలో అయితే ఉద్యోగం చేస్తున్నామో ఆ శాఖకు సంబంధించిన సర్వీస్ అంతా కొత్తగా ఉద్యోగం పొందిన శాఖలో కలుపుతారు. అదేవిధంగా కొత్తగా ఉద్యోగం పొందిన ఆ శాఖలో పనిచేయండం ఇష్టం లేకపోతే మూడు సంవత్సరాల్లోపు తిరిగి పాత ఉద్యోగంలో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ కొత్త ఉద్యోగంలోనే చేరిపోతే మూడేళ్ల తర్వాత ఆటోమెటిక్‌గా పాత శాఖలోని ఉద్యోగం రద్దవుతుంది. అయితే రాష్ట్రంలో పోలీస్ బెటాలియన్‌లలో ప్రస్తుతం ఈ పరిస్థితి విచిత్రంగా ఉంది. పోలీస్ బెటాలియన్‌లో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వ అనుమతితో డీఎస్సీ రాసి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారికి పోలీస్ అధికారులు రిలీవింగ్ ఇవ్వకుండా రిజైన్ లెటర్ తీసుకుంటున్నారు.

28 మంది డీఎస్సీకి ఎంపిక

రాష్ట్రంలో వివిధ బెటాలియన్‌లలో ఉద్యోగాలు చేస్తూ 28 మంది డీఎస్సీలో ఉద్యోగాలు పొందారు. కానీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరాలంటే బెటాలియన్ నుంచి రిలీవింగ్ లెటర్ ఇవ్వకుండా రిజైన్ చేయిస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగ సంఘాలన్నీ పాత పెన్షన్ విధానం కోసం ఉద్యమిస్తున్నాయి. ఒకవేళ భవిష్యత్‌లో పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తే తాము పెన్షన్‌కు అనర్హులం అవుతామని వాపోతున్నారు.

ఉద్యోగానికి రాజీనామా చేయాలన్నారు



నేను నల్లగొండ 12వ బెటాలియన్‌లో 5 సంవత్సరాలు, ఇబ్రహీంపట్నం 3వ బెటాలియన్‌లో 6 సంవత్సరాలు పని చేశా. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని 2024 డీఎస్సీ పరీక్ష రాసి ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎన్నికయ్యా. రిలీవ్ చేయాలని అడిగితే ఉద్యోగానికి రాజీనామా చేయాలన్నారు.

– మాలోతు శ్రీనునాయక్, బెటాలియన్ కానిస్టేబుల్

పేద ప్రజల పక్షాన పోరాడిన ధర్మ భిక్షం



జెండా ఎగురవేస్తున్న గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్

భానుపురి : ధర్మభిక్షం జీవితకాలం పేద ప్రజల పక్షాన పోరాటాలు చేశారని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ధర్మ భిక్షం భవనంలో గీత పనివారల సంఘం 67వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మ భిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గీత కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని చూసి చలించి వారి పక్షాన నిలబడి పోరాటాలు చేసిన మహానీయుడు ధర్మభిక్షం అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1957లో వరంగల్ జిల్లా గార్ల గ్రామంలో గీత పనివారల తొలి సంఘం ఏర్పడిందన్నారు. గీత వృత్తిని నిర్వీర్యం చేసేందుకు గతంలో ఎన్నో కుట్రలు జరిగాయని, ఆ కుట్రలను ధర్మభిక్షం తిప్పకొట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాల ధనుంజయ్‌గౌడ్, తోట్ల ప్రభాకర్, మురళి, జానయ్య, రామచంద్రయ్య, సత్యనారాయణ, బూర సైదులు, శ్రీకాంత్, విష్ణు, బూర లింగయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చెరుపల్లి లక్ష్మమ్మకు ఘన నివాళి



లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు

చిట్యాల: పట్టణానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు తల్లి లక్ష్మమ్మ, అక్క గంజి రంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం సీతారాములు కుటుంబ సభ్యులను రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంలు వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం లక్ష్మమ్మ, రంగమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, టి.జ్యోతి, అబ్బాస్, బీఆర్‌ఎస్ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గర్దాస్ బాలయ్య, వైద రవీందర్, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు అరుణజ్యోతి, సీపీఎం జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 9.5 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు అపహరణ

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. పొలం పనులకు వెళ్లే తొందరలో ఇంటి వెనుక తలుపునకు గడియ పెట్టకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశంచి ఆభరణాలు దొంగిలించారు. ఆదివారం ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం గ్రామానికి చెందిన కాపర్తి ఏసురత్నం శనివారం తన భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్లే క్రమంలో ఇంటికి తాళం వేసి వెనుక తలుపులు పెట్టి గడియ వేయడం మరచిపోయాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు వెనుక ద్వారం నుంచి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో బీరువాలో ఉన్న 9.5 తులాలు బంగారు ఆభరణాలు, 12 తులాలు వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన ఏసురత్నం కుటుంబీకులు ఇంట్లోకి ప్రవేశించగానే ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తెరిచి అందులోని దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని లాకర్‌ను చూసేసరికి అందులో దాచిపెట్టిన 9.5 తులాలు బంగారు ఆభరణాలు, 12 తులాలు వెండి ఆభరణాలు కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆదివారం బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గిరిజన విద్యార్థిని కుటుంబానికి మంత్రి సాయం

నల్లగొండ: మృతి చెందిన గిరిజన విద్యార్థిని కుటుంబానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని సాత్ తండాకు చెందిన రూపావత్ శిరీష (15) 9వ తరగతి చదువుతోంది. కాగా విద్యార్థిని పురుగుల మందు తాగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి రూ.50 వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ద్వారా శిరీష కుటుంబానికి అందజేశారు.



నగదు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

డీసీఎం బోల్తా.. 9 పశువులు మృతి



పశువులను తరలిస్తూ బోల్తా పడిన డీసీఎం



మృతి చెందిన పశువులు

నార్కట్‌పల్లి : ఎలాంటి అనుమతి లేకుండా డీసీఎంలో 40 పశువులను అక్రమంగా తరలిస్తుండగా వాహనం ప్రమాదవశాత్తు బస్సును ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 9 పశువులు మృతి చెందాయి. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి మండలంలోని వివేర హోటల్ సమీపాన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ డీసీఎంలో 40 పశువులను ఎలాంటి అనుమతులు లేకుండా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా డీసీఎం వెనుక భాగం నుంచి పూర్తిగా ప్యాక్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడుపుతూ నార్కట్‌పల్లి మండలంలోని వివేర హోటల్ సమీపాన ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఢీ కొనడంతో డీసీఎం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న 2 ఆవులు, 7 ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగతా పశువులు ఒకేసారి రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు 100 నంబర్‌కు కాల్ చేయడంతో పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడిన డీసీఎంను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మరో 30 పశువులను మాడుగులపల్లిలోని గోశాలకు తరలించారు. మరో ఆవుకు చికిత్స జరుగుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే డీసీఎం డ్రైవర్ అక్కడి నుంచి పారిపోగా అందులో ఉన్న ఇద్దరు కూలీలకు గాయాలు కావడంతో స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో నలుగురికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మృతి చెందిన పశువులను గ్రామ శివారులో గుంత తీసి పూడ్చిపెట్టారు. డీసీఎంలో మొత్తం (9 ఆవులు, 31 ఎద్దులు) 40 పశువులు ఉన్నాయి. 100 కాల్ డ్యూటీ కానిస్టేబుల్ గిరిబాబు ఫిర్యాదు మేరకు సీఐ నాగరాజు పర్యవేక్షణలో ఎస్‌ఐ దగ్గుల క్రాంతికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన పందుల జానకిరాములు

చివ్వెంల(సూర్యాపేట) : విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని ఖాసీంపేట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్ది శ్రీనివాస్ పొలంలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు శ్రీనివాస్‌తో పాటు గ్రామానికి చెందిన పందుల జానకిరాములు, లింగయ్య వెళ్లారు. పొలంలో మందు పిచికారీ చేస్తుండగా, వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసే ఎల్‌టీ విద్యుత్ వైర్ జంపర్ తెగి పొలంలో పడింది. ఈ క్రమంలో విద్యుత్ జంపర్ పందుల జానకిరాములు (50)కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడిని రక్షించేందుకు ప్రయత్నించిన మద్ది శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌ను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. విద్యుత్ ఏఈ, లైన్‌మెన్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ మృతుడి కుమారుడు శివ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కనకరత్నం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్: ఇంటిలో ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌లో నివాసం ఉంటున్న నాగయ్యచారి(47) పారిజాతకు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో పదేళ్లుగా భార్య నాగయ్యను విడిచి వెళ్లిపోయింది. ఒంటరిగా ఉంటున్న నాగయ్య మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో నాగయ్య ఉంటున్న ఇంటిలోంచి ఆదివారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు నందిపాడులో ఉంటున్న ఆయన తల్లికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా నాగయ్య మృతిచెంది ఉన్నాడు. నాగయ్య మృతిచెంది మూడు రోజులు కావొచ్చని,అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎయిమ్స్‌లో రాసలీలలు!

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలోని ఓ భవనంలో అర్ధ నగ్నంగా ఓ అమ్మాయి, అబ్బాయి హగ్గింగ్ చేసుకున్న ఓ వీడియో వారం రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆస్పత్రికి వచ్చిన రోగుల కంట హగ్గింగ్ సంఘటన కనపడడంతో వీడియో తీసి వైరల్ చేశారు. పలు యూట్యూబ్ చానళ్లలో ఎయిమ్స్‌లో రాసలీలు అంటూ ప్రసారమవుతుండడంతో స్థానికులు విస్మయానికి గురవుతున్నారు. ఎయిమ్స్‌లోని విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలువాటు పడి.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎయిమ్స్‌లోని గర్ల్స్ హాస్టల్, బాయ్స్ హాస్టల్ పక్కపక్కనే ఉండడంతో ఈ సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. వైద్య వృత్తికే కలంకం తెచ్చేలా ఉన్న ఆ వీడియో ఇంత వైరల్ అవుతున్నా ఎయిమ్స్ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నట్లు కనిపించకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓపీ భవనంలోని పై అంతస్తులో ముందు భాగంలోనే బయట వ్యక్తులకు కనిపించేలా దుస్తులు విప్పి బరితెగించడమే కాకుండా వీడియో తీస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు



పెద్దవూర: గేదెలు, గొర్రెలు, మేకల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దవూర మండల పశువైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్ రెడ్డి కోరారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నవంబర్ 14వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడు నెలలలోపు, చూడి పశువులు మినహా మిగతా వాటికి టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు..

గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిముల వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నులతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువులు ఎప్పుడు ముడుచుకుని పడుకుంటాయి. దీని కారణంగా పశువులు మేత, నీళ్లు సరిగా తీసుకోలేవు. నెమరు వేయలేవు. నోటి నుంచి సొంగ లేక నురగ కారుతుండటంతో పాటు పశువులు బరువు తగ్గిపోతాయి. పశువుల్లో పునరుత్పత్తి తగ్గిపోయి, చూడి పశువులు ఈసుకుపోయే(అబార్షన్) అయ్యే అవకాశం ఉంటుంది. కాళ్ల మధ్యన పుండ్లు పడడం వల్ల సరిగ్గా నడవలేవు. పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు పశువులు(ఎక్కువగా దూడలు) చనిపోయే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన దూడలు 30 నుంచి 40 శాతం చనిపోతుంటాయి. ముందుస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించుకోవడమే ఉత్తమం. వ్యాధి సోకిన పశువుల పాలను తాగడం వల్ల దూడలు చనిపోయే అవకాశం ఉంది.

పాడిపంట

చికిత్స విధానాలు..

- నోరు, పెదాలు, నాలుక, చన్నులు, కాళ్ల గిట్టల మధ్య వచ్చిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సెలైన్ నీటితో పరిశుభ్రంగా కడగాలి.
- కాళ్ల గిట్టల మధ్య పుండ్లను నీటితో కడిగిన తర్వాత ఆరనిచ్చి యాంటీ సెప్టిక్ లోషన్‌ను రాసి అవసరమైతే ఈగలు వాలకుండా నివారించడానికి కట్టు కట్టించాలి.
- రెండవసారి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండడానికి యాంటీ బయోటిక్స్ మందులు, పశువులలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి బి కాంప్లెక్స్ మందులను వాడాలి.

వ్యాధి నిరోధక టీకాలు

గాలింకుటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి. మన రాష్ట్రంలో సంవత్సరానికి రెండు సార్లు ఆరునెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా ప్రభుత్వమే వేయిస్తోంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న పాలు ఇతర దేశాలకు ఎగుమతి చేయాలంటే భారతదేశం గాలికుంటు వ్యాధి రహితంగా ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గాలికుంటు వ్యాధి నివారణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. పశువులు, జీవాల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యశాఖ అధికారులు చెప్పిన సమయంలో తప్పనిసరిగా వాటికి టీకాలు వేయించాలి. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కావడం వల్ల దీనిని నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు యజమానులు వాటి ఆరోగ్య పరిరక్షణ చూసుకుంటూ ఉండాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- వ్యాధి సోకిన పశువులను మందలో ఉంచకుండా వేరేగా కట్టేయాలి.
- పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు నీరు చల్లి వారానికి ఒకసారి సున్నం చల్లిస్తుండాలి.
- వ్యాధి సోకిన పశువులకు వాడిన పరికరాలను పాకలో ఉంచకుండా దూరంగా పడేయాలి. పాకలో ఉంచడం వల్ల ఈ వ్యాధి ఇతర పశువులకు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- జబ్బు చేసిన పశువు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసుకుని తాగాలి.
- పశువులను మేతకు తోలుకెళ్లినప్పుడు అక్కడ కుంటల్లో నిల్వ ఉన్న నీటిని తాగకుండా జాగ్రత్త వహించాలి.
- వ్యాధి సోకి పశువు చనిపోతే దానిని గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలి.
- చల్లని తాగునీరు పశువులకు అందించడం వలన పాల దిగుబడి బాగా ఉండడంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చు.
- ఏదైనా జరిగితే అప్రమత్తమై దగ్గరలో పశువైద్యాధికారిని సంప్రదించి ప్రథమ చికిత్స అందించడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చు.